సాక్షి నిర్మల్

సోమవారం : 30 : జనవరి : 2023



బుద్ధుడి మార్గం.. అనుసరణీయం

బుద్ధుడి శాంతిమార్గంలో పయనించాలని అంబేద్కర్ మనుమడు భీంరావు యశ్వంత్ అంబేద్కర్ సూచించారు. కన్కపూర్‌లో 25 అడుగుల బుద్ధ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 8లో▸



గ్రామదేవతలకు బోనాలు 9లో▸

జిల్లా వ్యాప్తంగా ఆదివారం మహిళలు గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. ఆయా ఆలయాల్లో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.1 /18.2

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండగా అనిపిస్తుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

పోటీప్రపంచాన్ని తట్టుకొని గెలవాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథులు

నిర్మల్: పోటీ ప్రపంచాన్ని తట్టుకుని విద్యార్థులు గెలవాలని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జే రవికిరణ్ సూచించారు. జిల్లాకేంద్రంలోని మయూరి ఇన్‌లో ఆదివారం దీక్ష జూనియర్ కళాశాల సెకండియర్ విద్యార్థులు 'గ్లోరియస్ ఫెస్ట్' పేరిట వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు విద్యార్థులు సిద్ధమవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ప్రభుత్వ అధ్యాపకుడు సత్యపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రమోద్‌రావు, శంకర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కవులను చైతన్యపరిచిన గోల్కొండ కవియాత్ర



మాట్లాడుతున్న కవులు

నిర్మల్‌టౌన్: సమాజాన్ని చైతన్యపరిచి వినూత్న ఆలోచనలకు నాందిగా గోల్కొండ కవియాత్ర నిలిచిందని కవులు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, వెంకట్ పేర్కొన్నారు. ప్రేమ, సత్యం, శాంతిపథంలో కవియాత్ర నడిచిందని తెలిపారు. ఈనెల 22న హైదరాబాద్‌లోని గన్‌పార్క్, రవీంద్రభారతి, గోల్కొండలో దాదాపు 300కు పైగా కవులు, కవయిత్రులు పాల్గొని సమాజాన్ని చైతన్యపరిచేలా కవియాత్ర నిర్వహించారు. కవియాత్ర విజయవంతమైన సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని కవియాత్ర గృహంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫిబ్రవరి 5న కవియాత్ర విజయోత్సవ సభ నిర్మల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు. కవియాత్ర అధ్యక్షుడు శంకర్, నివేదిత పాల్గొన్నారు.



వానల్‌పాడ్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కోతల వెతలు

- కరెంట్ కష్టాల్లో రైతులు
- నిత్యం అప్రకటిత 'కోత'లు
- ఎండుతున్న వరి పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు

భైంసా/భైంసారూరల్: అప్రకటిత విద్యుత్ కోతలు రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా సరిగా లేక పంటలు ఎండుతున్నాయి. ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని కరెంట్ వారంరోజులుగా అన్నదాతలను ముప్పుతిప్పలు పెడుతోంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఆందోళన బాట పడుతున్నారు. శనివారం కుంటాల, పెంబిలో రాస్తారోకో నిర్వహించారు. ఆదివారం భైంసా మండలంలోని పేండ్‌పెల్లి, వానల్‌పాడ్, వాటోలి, సుంక్లి గ్రామాల రైతులంతా వానల్‌పాడ్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. దాదాపు జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉండగా రైతులు ఆందోళన బాట పడుతున్నారు.

రోజుకోచోట ఆందోళన

జిల్లాలో మూడురోజులుగా ఏదోచోట కరెంట్ కోతలపై రైతులు ఆందోళనలు చేపడుతున్నారు. పంటల పరిస్థితి అధికారులకు వివరిస్తున్నారు. త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలని కోరుతున్నారు. వేసవికిముందే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉండబోతుందోనని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పొట్టదశలో మొక్కజొన్న

రెండు నెలల క్రితం జిల్లావ్యాప్తంగా రైతులు మొక్కజొన్న సాగుచేశారు. ఇప్పటివరకు ఏడు నుంచి ఎనిమిది తడులు అందించాల్సి ఉండగా కరెంట్ కోతలతో సకాలంలో నీరు అందని దుస్థితి ఉంది. జిల్లా అంతటా మొక్కజొన్న ఏపుగా పెరిగినా 15 రోజులుగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సబ్‌స్టేషన్లను సంప్రదిస్తే పైనుంచే సమస్య ఉందని సిబ్బంది చెబుతున్నారు. పొట్టదశలో ఉన్న మొక్కజొన్నకు నీటి తడులు సరిగా అందకుంటే పంట దెబ్బతినే ప్రమాదం ఉండగా రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

మొలకెత్తే దశలో నువ్వు

15 రోజులుగా జిల్లావ్యాప్తంగా నువ్వు సాగుచేస్తున్నారు. కొన్ని చోట్ల మొలకెత్తే దశలో ఉంటే ఇంకొన్ని చోట్ల ఇప్పుడిప్పుడే విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో కరెంట్ కోతల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. బోరుబావుల కిందే ఈ పంటలు సాగవుతుండగా విద్యుత్ కోతల కారణంగా విసిగి వేసారిన రైతులు సబ్‌స్టేషన్ల ముట్టడికి దిగుతున్నారు.

బీటలు వారుతున్న పొలాలు



భైంసా మండలం ఇలేగాంలో బీటలువారుతున్న పొలం

యాసంగిలో జిల్లావ్యాప్తంగా రైతులు వరి, మొక్కజొన్న, నువ్వు, సోయా తదితర పంటలు సాగు చేశారు. వ్యవసాయానికి ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తున్నామంటూ కొన్నేళ్లుగా 16 గంటలకే కుదించింది. అది కూడా ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వారం రోజులుగా సరిగా నీటితడులు అందక వరి పొలాలు ఎండుతున్నాయి.

పంటలు ఎండుతున్నయ్



త్రీఫేజ్ కరెంట్ లేక పంటలు ఎండుతున్నయ్. అధికారులు కరెంట్ ఎప్పుడిస్తరో తెలుస్త లేదు. పంట పొలాల వద్ద గంటల తరబడి ఎదురుచూస్తున్నం. మా బాధలు ఎవరూ పట్టించుకోవడంలేదు. ఎవరికి చెప్పినా ఫలితం ఉండడంలేదు. - గంగాధర్, భైంసా

14 గంటలైనా ఇయ్యాలే..



24గంటలు అని చెబుతున్న ప్రభుత్వం ఎనిమిది గంటలు కూడా సరిగా కరెంట్ ఇయ్యడం లేదు. 14 గంటలైనా నిరవధికంగా ఇయ్యాలె. రాత్రి ఏడు గంటలు, దినంలో ఏడు గంటలు సరఫరా చేయాలె. అధికారులు స్పందించి పంటలు ఎండకుండా చూడాలె. - గోవర్ధన్, ఇలేగాం

ఉన్నతాధికారులకు వివరిస్తాం

పైనుంచి సరఫరా లేకే త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఉన్నతాధికారులకు పరిస్థితి వివరిస్తాం. రానున్న రోజుల్లో త్రీఫేజ్ కరెంట్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తాం. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఏమీ చేయలేకపోతున్నాం. పైనుంచి సరఫరా ఉంటే త్రీఫేజ్ ఇవ్వడంలో మాకు ఎలాంటి అభ్యంతరంలేదు.

- రాంబాబు, విద్యుత్ ఏఈ

బదిలీల కోసం ధ్రువపత్రాలు అందించాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రాధాన్యత కేటగిరీ ఉపాధ్యాయులు సోమవారం సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందించాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ, వైద్యపరమైన కారణాలతో దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు తమకు గల ప్రాధాన్యత కేటగిరీకి సంబంధించి జిల్లా మెడికల్ బోర్డు లేదా రాష్ట్ర మెడికల్ బోర్డు జారీ చేసిన ధ్రువపత్రాన్ని అందించాలని పేర్కొన్నారు. ధ్రువపత్రాన్ని జారీ చేసేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్య నిపుణులతో మెడికల్ బోర్డు ఏర్పాటైందని తెలిపారు. ధ్రువపత్రాన్ని ఎంఈవోతో అటెస్టేషన్ చేయించి ఆన్‌లైన్ దరఖాస్తుకు జత చేసి డీఈవో కార్యాలయంలో సోమవారం అందించాలని సూచించారు. దివ్యాంగులైన ఉపాధ్యాయులు 70% కన్నా ఎక్కువ దృష్టి లోపం, వినికిడి లోపం, శారీరక వైకల్యం గలవారు సదరం ధ్రువపత్రాన్ని అందించాలని తెలిపారు. వైద్యపరమైన కారణాలు గల ఉపాధ్యాయులు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, ఓపెన్‌హార్ట్ సర్జరీ చేసుకున్నవారు, బోన్ టీబీ కలవారు, మూత్రపిండాలు, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్నవారు, మూత్రపిండాల వ్యాధితో డయాలసిస్ పొందుతున్న వారు తేదీ 1.1.2021 తర్వాత పొందిన మెడికల్ బోర్డు ధ్రువపత్రాన్ని అందించాలని పేర్కొన్నారు. వైద్యపరమైన కారణాలతో బాధ పడుతున్న పిల్లలు, మానసిక వైకల్యం గల పిల్లలు, తలసేమియా వ్యాధి గల పిల్లలు, మస్కులర్ డిస్ట్రోఫీ గల పిల్లలు, గుండెలో రంధ్రం ఏర్పడిన పిల్లలు, చిన్న వయసులోనే మధుమేహం గల పిల్లలు కలిగిన ఉపాధ్యాయులు తేదీ 1.1.2021 తర్వాత పొందిన ధ్రువపత్రాలు అందించాలని తెలిపారు. తల్లిదండ్రుల్లో ఎవరైనా ఒకరు మాత్రమే ప్రాధాన్యత కేటగిరీని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ప్రాధాన్యత కేటగిరీ పొందే ఉపాధ్యాయులు, వారి కోసం ఏర్పాటు చేసిన బోర్డును సంప్రదించి అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో అవసరమైన సహాయం కోసం జిల్లా విద్యాశాఖ విలీన విద్యా సమన్వయ కర్త ప్రవీణ్‌కుమార్‌ను 7013372750 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. వైద్యం పొందిన మహిళా ఉపాధ్యాయినులు, న్యాయపరంగా విడాకులు పొందిన మహిళా ఉపాధ్యాయినులు తగిన రుజువుపత్రాలు అందించాల్సి ఉంటుందని వివరించారు.

యువత క్రీడాస్ఫూర్తితో రాణించాలి



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ముత్యంరెడ్డి

మామడ: యువత క్రీడాస్ఫూర్తితో ఆటల్లో రాణించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యంరెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. లింగాపూర్ తండాలో నిర్వహించిన టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. నాయకులు బాపురెడ్డి, రాజిరెడ్డి, సంతోష్, సత్యం చంద్రకాంత్, నవీన్, శ్రీకాంత్‌రెడ్డి, రాజేశ్వర్, రంజిత్, ఇమ్రాన్, సూరి, ఆశన్న, అమీర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



హాఫ్ మారథాన్‌లో రఘునందన్‌రెడ్డి

నిర్మల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జిల్లాకేంద్రానికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యుడు రఘునందన్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని దుర్గం చెరువు సమీపంలో ఆదివారం నిర్వహించిన 21కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌లో నిర్మల్ నుంచి ఆయన పాల్గొన్నారు. రెండుగంటల్లో మారథాన్ పూర్తిచేశామని రఘునందన్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్యం కోసం వ్యాయామం, రన్నింగ్, వాకింగ్, సైక్లింగ్ అవసరమనే విషయంపై అవగాహన కల్పించేందుకు మారథాన్‌లో పాల్గొన్నట్లు ఆయన చెప్పారు.

అడెల్లి మహాపోచమ్మను దర్శించుకున్న మంత్రి సతీమణి



ఆలయంలో పూజలు చేస్తున్న విజయలక్ష్మి

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ అమ్మవారి ని ఆదివారం రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆమెకు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, సిబ్బంది స్వాగతం పలికారు. పూజల అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ మర్యాదలతో ఆమెను సత్కరించారు.

సాగులో భేష్..!

సాక్షి, మంచిర్యాలడెస్క్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ రంగంలో ముందుంది. విభిన్న రకాల పంటల సాగు, దిగుబడితో ప్రత్యేకతను చాటుకుంటోంది. నిర్మల్ జిల్లా మొక్కజొన్న సాగు, దిగుబడిలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. పప్పుధాన్యాలు, పత్తి సాగులో ఆదిలాబాద్ జిల్లా భేష్ అనిపించుకుంటోంది. సోయాబీన్ సాగులో రాష్ట్రంలోనే ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఆదిలాబాద్‌లో 1,01,675 ఎకరాల్లో సాగు కాగా 73,900 టన్నులు, నిర్మల్‌లో 82,031 ఎకరాల్లో సాగు కాగా 47,205 టన్నుల దిగుబడి వచ్చింది. ఇక ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ప్రజలు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వాహనాల రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తే ఆ విషయం స్పష్టమవుతోంది. తెలంగాణ రాష్ట్ర స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్-2022 నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వివిధ రంగాల వారీగా పరిశీలిస్తే..



- మొక్కజొన్నలో నిర్మల్
- పప్పుధాన్యాల్లో ఆదిలాబాద్
- 'తలసరి'లో ఉమ్మడి జిల్లా వెనుకంజ
- ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రజల దృష్టి
- రాష్ట్ర గణాంకాల నివేదికలో వెల్లడి

మొక్కజొన్న సాగులో నిర్మల్ టాప్



చిరుధాన్యాల సాగులో నిర్మల్ జిల్లా ముందుంది. మొక్కజొన్న, జొన్న, సజ్జలు తదితర పంటలు సాగయ్యాయి. 2021-22 వానాకాలంలో 23,510 ఎకరాల్లో మొక్కజొన్న సాగు కాగా 59,970 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు సగటున 25.51 క్వింటాళ్ల దిగుబడి నమోదైంది. యాసంగిలో నిర్మల్ జిల్లాలో మొక్కజొన్న 72,739 ఎకరాల్లో సాగు కాగా 2,71,026 టన్నుల దిగుబడి వచ్చింది. ఎకరాకు సగటున 37.26 క్వింటాళ్ల దిగుబడి రాగా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. రెండు సీజన్లలో కలిపి 96,249 ఎకరాల్లో సాగు కాగా 3,30,996 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు సగటున 34.39 క్వింటాళ్ల దిగుబడితో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

- ఆదిలాబాద్ జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్లు కలిపి 7,330 ఎకరాల్లో సాగు కాగా 13,199 టన్నుల దిగుబడి వచ్చింది. ఎకరానికి సగటున 18.01 క్వింటాళ్ల పండింది.
- మంచిర్యాల జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్లలో 2,263 ఎకరాల్లో సాగు కాగా 3,738టన్నులు, సగటున ఎకరానికి 16.52 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.
- కుమురంభీం జిల్లాలో రెండు సీజన్లు కలిపి అతి తక్కువగా 1,879 ఎకరాల్లో సాగైంది. 2,958టన్నుల దిగుబడి రాగా ఎకరానికి సగటున 15.74 క్వింటాళ్లు వచ్చింది.

పప్పుధాన్యాల సాగులో ముందున్న ఆదిలాబాద్



పత్తితోపాటు పప్పుధాన్యాల సాగులోనూ ఆదిలాబాద్ జిల్లా ముందుంది. 89,829 ఎకరాల్లో శనగపంట సాగు కాగా 52,821 టన్నుల దిగుబడి వచ్చింది. సగటున ఎకరాకు 5.88 క్వింటాళ్లు పండించారు.

- నిర్మల్ జిల్లాలో 67,775 ఎకరాల్లో శనగపంట సాగు కాగా 42,980 టన్నుల దిగుబడి రాగా, ఎకరాకు 6.34 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.
- కుమురంభీం జిల్లాలో 7,391 ఎకరాల్లో సాగు కాగా 3,989 టన్నుల దిగుబడి వచ్చింది. మంచిర్యాల జిల్లాలో అతి తక్కువగా 426 ఎకరాల్లో సాగైంది.

వరి సాగు నామమాత్రమే..



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధానంగా పత్తి, ఎర్రజొన్నలు, సోయాబీన్ తదితర పంటలకు ప్రాధాన్యం ఇవ్వగా వరి వానాకాలం, యాసంగిలో నామమాత్రంగానే సాగైంది. రెండు సీజన్లలో కలిపి మంచిర్యాల జిల్లాలో 2,25,174 ఎకరాల్లో, నిర్మల్ జిల్లాలో 1,75,293, కుమురంభీం జిల్లాలో 59,633 ఎకరాల్లో సాగు కాగా, ఆదిలాబాద్ జిల్లాలో కేవలం 2,060 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం.

ఎలక్ట్రిక్ వాహనం రయ్.. రయ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం గతంతో పోల్చితే పెరిగింది. 2020-21లో ఒక్క వాహనం కూడా రిజిస్ట్రేషన్ కాలేదు. 2021-22లో వాహనాల సంఖ్య 739కి చేరింది. రాష్ట్రంలోని జిల్లాల్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంలో హైదరాబాద్ 9,161 వాహనాల రిజిస్ట్రేషన్‌లతో ప్రథమ స్థానంలో నిలువగా.. కుమురంభీం జిల్లా 34 వాహనాలతో 31వ స్థానంలో ఉంది. నిర్మల్ జిల్లాలో 397, ఆదిలాబాద్ జిల్లాలో 182 మంచిర్యాల జిల్లాలో 126 రిజిస్ట్రేషన్లు జరిగాయి. అనధికారికంగా ఈ వాహనాల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది.

తగ్గిన వాహనాల కొనుగోళ్లు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మోటారుసైకిళ్లు, కార్లు, రవాణా వాహనాల కొనుగోళ్లు 2020-21తో పోల్చి చూస్తే 2021-22 నాటికి స్వల్పంగా తగ్గాయి. కరోనా ప్రభావం కారణంగా 2020లో వ్యక్తిగత వాహనాల కొనుగోళ్లు పెరగగా ఆ తర్వాత తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది.

జిల్లాలు	2020-21	2021-22
నిర్మల్	14,320	13,856
మంచిర్యాల	13,485	11,941
ఆదిలాబాద్	11,626	10,107
కుమురంభీం	6,801	6,122

ఉన్నత విద్యకు దూరం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ప్రాథమికోన్నత స్థాయిలో విద్యార్థులు బడి మానేస్తుండగా.. ఉన్నత విద్యకు వచ్చేసరికి వారి శాతం పెరిగిపోతోంది. ఆదిలాబాద్ జిల్లాలో ప్రాథమికోన్నత స్థాయిలో 5.43 శాతం మంది, ఉన్నత విద్య స్థాయిలో 7.13శాతం విద్యార్థులు బడి మానేశారు. నిర్మల్ జిల్లాలో ప్రాథమిక విద్యలో 5.21శాతం, ఉన్నత విద్యలో 11.37శాతం, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాథమిక విద్యలో 3.51శాతం, ఉన్నత విద్యలో 11.91శాతం, మంచిర్యాల జిల్లాలో ప్రాథమిక విద్యలో 1.62శాతం, 12.76శాతం విద్యార్థులు డ్రాపౌట్స్ ఉన్నారు.

తలసరి ఆదాయం తక్కువే..!



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజల వార్షిక తలసరి ఆదాయం తక్కువగానే ఉంది. 2011-12 నాటికి 2020-21 నాటికి పోల్చి చూస్తే కొంత పెరుగుదల కనిపించినా ఇంకా అట్టడుగునే ఉన్నారు. రాష్ట్రంలో వరంగల్ అర్బన్ జిల్లా అట్టడుగున ఉండగా.. ఆ తర్వాతి స్థానంలో కుమురంభీం జిల్లా ఉంది. కుమురంభీం జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.1.31లక్షలు, ఆదిలాబాద్ జిల్లా రూ.1.52లక్షలు, నిర్మల్ జిల్లా రూ.1.51లక్షలు, మంచిర్యాల జిల్లా రూ.1.60లక్షలు ఉంది.

తెల్లబంగారం.. ఆదిలాబాద్



తెల్లబంగారంగా పేరొందిన పత్తి పంట సాగులో ఆదిలాబాద్ జిల్లా రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచింది. 3,87,176 ఎకరాల్లో సాగు కాగా 2,09,800 టన్నుల దిగుబడి వచ్చింది. ఎకరానికి సగటున 5.42క్వింటాళ్లు పండింది. ఉమ్మడి జిల్లాలో పత్తి సాగులో కుమురంభీం జిల్లా 3,12,364 ఎకరాల్లో సాగు కాగా 1,78,744 టన్నుల దిగుబడితో రెండో స్థానంలో నిలిచింది. ఎకరాకు సగటున 5.72 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

- నిర్మల్ జిల్లాలో 1,61,998 ఎకరాల్లో పత్తి సాగైంది. 68,509 టన్నుల దిగుబడి రాగా, ఎకరాకు సగటున 4.23 క్వింటాళ్లుగా ఉంది.
- మంచిర్యాల జిల్లాలో 1,60,454 ఎకరాల్లో సాగు కాగా 83,374 టన్నుల దిగుబడి వచ్చింది. ఎకరానికి సగటున 5.20క్వింటాళ్లు పండింది.

జనసాంద్రత ఇలా..



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కుమురంభీం జిల్లాలో జనసాంద్రత అత్యల్పంగా ఉంది. రాష్ట్రంలో చదరపు కిలోమీటరుకు అత్యధిక జనసాంద్రత హైదరాబాద్ జిల్లాలో 18,161మంది, అత్యల్పంగా ములుగు జిల్లాలో 71మంది ఉన్నారు.

జిల్లా	జనాభా	విస్తీర్ణం	చ.కి.మీ పరిధిలో
కుమురంభీం	5,15,812	4,491.28	115
ఆదిలాబాద్	7,08,972	4,491.28	179
నిర్మల్	7,09,418	3,731.35	190
మంచిర్యాల	8,07,037	3,908.04	207

స్త్రీ, పురుష నిష్పత్తిలో నిర్మల్ టాప్

స్త్రీ, పురుష నిష్పత్తిలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉంది. రాష్ట్ర సగటు 988 (ప్రతి వెయ్యి మంది పురుషులకు)గా ఉండగా.. ఇక్కడ మాత్రం 1046గా నమోదైంది. కుమురంభీం, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలు వరుసగా 13, 21, 24 స్థానాల్లో ఉన్నాయి.

జిల్లాల వారీగా..

జిల్లా	స్త్రీలు	పురుషులు	నిష్పత్తి
నిర్మల్	3,62,697	3,46,721	1,046
కుమురంభీం	2,57,615	2,58,197	998
ఆదిలాబాద్	3,52,565	3,56,407	989
మంచిర్యాల	3,98,765	4,08,272	977



క్లుప్తంగా

పురుగులమందు తాగి ఒకరి ఆత్మహత్య

సారంగాపూర్: మండల కేంద్రంలోని ఊరగుట్టకు చెందిన పులి గంగాధర్(30) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... గంగాధర్ మండలంలోని తాంద్ర(జి) గ్రామంలో పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. అయితే ఆయన భార్య పులి లక్ష్మి, గంగాధర్‌ల మధ్య తరచూ విభేదాలు, గొడవలు తలెత్తేవి. ఈక్రమంలో పలుమార్లు లక్ష్మి తన పుట్టింటికి వెళ్లి రోజుల తరబడి అక్కడే ఉండేది. ఇలా తరచూ జరుగుతుండడంతో తీవ్ర మనస్తాపానికి గురైన గంగాధర్ పశువులు మేపేందుకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగాడు. గమనించిన తోటి పశువుల కాపరులు వెంటనే నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఐదేళ్ల కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

జైనథ్: మండలంలోని తరోడ గ్రామానికి చెందిన టాప్రే రవీందర్ (38) జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. రవీందర్ కొంత కాలంగా ఛాతి నొప్పితో బాధపడుతున్నాడు. అతడికి భార్య కవిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య కాన్పు కోసం పుట్టింటికి వెళ్లడంతో ఇంటి వద్ద ఒక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి లోపల నుంచి గడి పెట్టుకొని పురుగుల మందు తాగాడు. దీంతో రాత్రి ఇంట్లోంచి దుర్వాసన వస్తుండటంతో చుట్టుపక్కల వాళ్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూడగా మృతిచెంది కనిపించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పెర్సిస్ బిట్ల తెలిపారు.

యువకుడి అరెస్టు

ఖానాపూర్: బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన బాలికను రంగపేట గ్రామానికి చెందిన యువకుడు ఈ నెల 27న కిడ్నాప్ చేశాడు. దీంతో బాలిక తండ్రి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆదివారం సదరు యువకుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

కుంటాలను సందర్శించిన ట్రెయినీ ఎఫ్‌బీవోలు



జలపాతం విశిష్టతను వివరిస్తున్న సెక్షన్ ఆఫీసర్ వసంత్

నేరడిగొండ: రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతంగా పేరొందిన కుంటాల జలపాతాన్ని 32వ బ్యాచ్‌కు చెందిన 40 మంది ట్రెయినీ ఎఫ్‌బీవోలు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి కుంటాల సెక్షన్ ఆఫీసర్ వసంత్, బీట్ ఆఫీసర్ సచిన్ స్వాగతం పలికారు. అనంతరం జలపాతం విశిష్టతను వారికి వివరించారు. ఏకో డెవలప్‌మెంట్ కమిటీ ప్రాముఖ్యతను తెలియజేశారు. వడూర్ అటవీ ప్రాంతంలో ఎఫ్‌ఆర్‌వో గణేశ్ ఆధ్వర్యంలో ఐదు కిలోమీటర్ల నడక నిర్వహించారు. అటవీ జంతువుల రక్షణకు, అడవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వో సుభాష్‌చంద్ర, అద్దాల తిమ్మాపూర్ ఎఫ్‌బీవో భీంరావు, ఈడీసీ కమిటీ చైర్మన్ నర్సయ్య, కుంటాల జలపాతం వాచర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాగోబా జాతర



పూజల కోసం క్యూలో నిల్చున్న భక్తులు

- తరలివచ్చిన భక్తులు
- నేడు నాగోబా ఆలయ హుండీ లెక్కింపు

ఇంద్రవెల్లి: ఈ నెల 21న మెస్రం వంశీయుల మహా పూజలతో ప్రారంభమైన నాగోబా జాతర ఆదివారంతో ముగిసింది. ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాల వద్ద యువతి, యువకులతో సందడిగా మారింది. జాతరలోని దుకాణ సముదాయాల వద్ద ఇంటికి కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. నాగోబా ఆల య హుండీ లెక్కింపును సోమవారం దేవాదా య శాఖ, ఐటీడీఏ, మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో లెక్కించనున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు.



రంగుల రాట్నాల వద్ద యువకుల సందడి



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అభివృద్ధి పనులను అడ్డుకుంటే సహించం

- రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎంపీ సోయం బాపురావు
- అనుమతులు లేవని అడ్డుకున్న అటవీశాఖ అధికారులు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపురావు

ఇచ్చోడ: అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం తమ చెప్పుచేతుల్లో ఉన్న అధికారులతో అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు ఆరోపించారు. ఆదివారం సిరిచెల్మ నుంచి నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని పుల్‌గామ్ ప్రాండి వరకు రోడ్డు నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణం పనులు చేపట్టవద్దని అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అడవి జంతువులపై ఉన్న ప్రేమ ఆదివాసీ గిరిజనులపై లేదన్నారు. అడవులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులకు కనీస రోడ్డు సౌకర్యం కల్పించకుండా అడ్డుకుంటుందన్నారు. పది రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖ ద్వారా రోడ్డు పనులకు అనుమతులు ఇవ్వకుంటే, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గల్లోని 20 గ్రామాల ప్రజలే రోడ్డు నిర్మాణం చేపట్టుకోవాలని పిలుపునిచ్చారు. రెండు నియోజకవర్గ ప్రజలు తరలిరావడంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కార్యక్రమంలో ఖానాపూర్ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రీహరినాయక్, పెంబి, సిరికొండ మండలాల జెడ్పీటీసీలు జానుబాయి, కుమ్ర చంద్రకళ రఘురాం, పెంబి, సిరికొండ ఎంపీపీలు భూక్యా కవిత, పెందురు అమృత్‌రావు, బీజేపీ గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకాటి దశరథ్, జిల్లా నాయకులు జీవి రమణ, రాజు యాదవ్ పాల్గొన్నారు.

అనుమతులు లేవు...

ఫకీర్‌పేట్ నుంచి పుల్‌గామ్ పాండ్రి వరకు అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం కోసం అనుమతులు లేవని ఇచ్చోడ, పెంబి టైగర్‌జోన్ అటవీ అధికారులు వాహబ్ అహ్మద్, రామకృష్ణరావు విలేకరులతో తెలిపారు.

బుద్ధుడి మార్గం అనుసరణీయం



మాట్లాడుతున్న యశ్వంత్



విగ్రహాన్ని ఆవిష్కరించిన అంబేడ్కర్ మనువడు భీంరావు యశ్వంత్

- అంబేడ్కర్ మనుమడు భీంరావు యశ్వంత్ అంబేడ్కర్
- 25 అడుగుల బుద్ధుడి విగ్రహం ఆవిష్కరణ

లోకేశ్వరం: ప్రపంచ యుద్ధాలకు బదులుగా బుద్ధుడు చూపిన శాంతి మార్గంలో దేశాలు పయనించాలని బీఎస్ఐ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, అంబేడ్కర్ మనుమడు భీంరావు యశ్వంత్ అంబేడ్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని కన్కపూర్ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 25అగుడుల గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోనే రెండోవది కన్కపూర్ గ్రామంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ బుద్ధుడు బోధించిన వైజ్ఞానిక మార్గాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బుద్ధవిహార్‌లకు నిధులు, స్థలాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, పూజ్య భదంత్ సంఘపాల్‌జి, మహాథేరో పూజ్య భదంత్ దీపాంకర్‌జి, బీఎస్ఐ తెలంగాణ అధ్యక్షుడు ప్రభాకర్ గడపాలే, బీఎస్ఐ ప్రధాన కార్యదర్శి నిర్మల్ జిల్లా కొంతం మురళీధర్, మెంబర్ ఆఫ్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సమత సుదర్శన్, ఏవైఏ అధ్యక్షుడు మోడం శంకర్, సర్పంచ్ సాలాయ నరేశ్, బీఎస్ఐ మండల అధ్యక్షుడు దిలీప్ కదం, వీడీసీ చెర్మన్ సునీల్ సిందే తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య



చంద్రభాన్ మృతదేహం

గుడిహత్నూర్: మద్యం మత్తులో యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం... సిర్పూర్(యూ) మండలంలోని ఛప్రి గ్రామానికి చెందిన చంద్రభాన్(33)కు మండలంలోని శంభుగూడకు చెందిన ప్రేమలతతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వివాహ అనంతరం అత్తారింటికి ఇల్లరికం వచ్చాడు. వీరికి ఐదేళ్ల కూతురు ఉంది. అత్తగారికి చెందిన తొమ్మిది ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. వ్యవసాయంలో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీనికితోడు తాగిన మైకంలో కుటుంబ సభ్యులతో తరుచుగా గొడవపడేవాడు. హైదరాబాద్‌కు వెళ్లి పనిచేసికుంటానని శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడగా వారు ఒప్పుకోలేదు. దీంతో ఆదివా రం ఉదయమే మద్యం తాగి ఇంటి నుంచి చేనుకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకునే సరికి మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వంతెన పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం

భైంసాటౌన్: పట్టణంలోని సాత్‌పూల్ వంతనపై నుంచి దూకి దేగాం గ్రామానికి చెందిన సురేశ్ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనలో సురేశ్ కాలు విరిగింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఏరియాస్పత్రికి తరలించారు. ఇటీవల దేగాంలో భార్యను హత్యచేసిన కేసులో నిందితుడి సోదరుడు సురేశ్‌ను పోలీసులు విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. పోలీసులంటే భయపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సురేశ్ పేర్కొన్నాడు. ఈ విషయమై రూరల్ ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా తాము కేసుకు సంబంధించి విచారణలో భాగంగానే పిలిపించామని పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

- డ్రైవర్ మృతి
- మరో ఇద్దరికి గాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు




షేక్ ఇర్ఫాన్ (ఫైల్)

నేరడిగొండ: ఆటోను కారు ఢీకొనగా ఆటో డ్రైవర్ మృతిచెందిన ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని దూదిగండి జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వాంకిడి గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ తన ఆటోలో నేరడిగొండకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఇద్దరు కూలీలను తీసుకొని వాంకిడి వైపు వెళ్తున్నాడు. దూదిగండి జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి ఆటోను కారు ఢీనగా ఆటో జాతీయ రహదారి పైనుంచి కింద బోల్తా పడింది. దీంతో డ్రైవర్ షేక్ ఇర్ఫాన్ (28) సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఆటోలోని ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు 108లో క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఒక కూతురు ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. సంఘటన స్థలానికి జెడ్పీటీసీ అనిల్ జాదవ్ చేరుకొని పరిశీలించారు. అనంతరం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ఆయన వెంట వాంకిడి సర్పంచ్ అడిగం రాజు, గ్రామస్తులు ఉన్నారు.

ఒకరిపై కేసు

ఎదులాపురం: వేగంగా కార్ డ్రైవ్ చేసి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై ఆదివారం పట్టణ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హరిబాబు కథనం ప్రకారం... పట్టణంలోని ఖానాపూర్‌లోని ఆటోస్టాండ్ దగ్గర అదే కాలనీకి చెందిన అజీంఖాన్, ఉమర్‌లు ఆటో, ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి నిల్చున్నారు. ఈ క్రమంలో ఖానాపూర్ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను, ఉమర్‌ను ఢీకొంది. దీంతో వాహనాలకు కొంత ధ్వంసం కాగా, ఉమర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవ్ చేసిన అర్బాత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాసరలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గంగమ్మ తల్లికి, సూర్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. తర్వాత నిత్యహారతిఘాట్‌లో నిర్వహించిన హోమపూజల్లో పాల్గొన్నారు. అనంతరం బాసర ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

వైఎస్సార్ పాలన తిరిగి తెచ్చేలా పనిచేయాలి



మాట్లాడుతున్న గట్టు రాంచంద్రారావు



సమావేశానికి హాజరైన పార్టీ ముఖ్య నాయకులు

- కార్యకర్తలను నాయకులుగా తయారుచేస్తాం
- బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వీఆర్‌ఎస్ తప్పదు
- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర కార్యాచరణ కమిటీ సభ్యుడు రాంచంద్రారావు

కైలాస్‌నగర్: తెలంగాణలో వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సుపరిపాలన తిరిగి రావాలంటే వైఎస్ శర్మిలను సీఎం చేసే దిశగా ప్రతీ కార్యకర్త పార్టీ నిర్మాణం కోసం బాధ్యతతో పనిచేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర కార్యాచరణ కమిటీ సభ్యుడు గట్టు రాంచంద్రారావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న తమ అధినేత్రి షర్మిలను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. మహిళ అని కూడా చూడకుండా దాడి చేస్తుందన్నారు. అరెస్టులు, దిగ్బంధంతో పాటు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా వాహనంలో ఉంచి లాక్కెల్లారన్నారు. గతంలో మానుకోటలో వైఎస్ జగన్‌పై దాడి చేస్తే ఆయన ఏపీ సీఎం అయ్యారన్నారు. నర్సంపేటలో షర్మిలపై కూడా దాడి చేశారని ఆమె కూడా తెలంగాణ సీఎం ఖావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించక, పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 11మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఇందుకు కేసీఆరే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ బెజ్జంకి అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యచరణ కమిటీ సభ్యులు నీలం రమేష్, శాంతికుమార్, నాగారాజు, కవిత, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అధ్యక్షులు పెందూర్ మనోహర్, దుర్గం నగేష్, గోవింద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుడిపై దాడి హేయమైన చర్య

- మానవ హక్కులు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న భుజంగ్‌రావు

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండ గొండుగూడ గ్రామానికి చెందిన కోవ లింబారావుపై అటవీశాఖ అధికారిణి, ప్రైవేట్ వాచర్‌తో పాటు మరో వ్యక్తి దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని నాగల్‌కొండ గొండుగూడ గ్రామాన్ని సందర్శించారు. కోవ లింబారావు కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాడి చేసిన సంఘటనా స్థలాన్ని గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో కొన్ని ప్రత్యేక చట్టాలున్నాయని తెలిపారు. లింబారావు చేసిన తప్పు ఏమిటో అధికారులు చెప్పాలని కోరారు. అడవిలో విలువైన కలప, ఇసుక, గుట్టలు మాయం అవుతుంటే అటవీశాఖ అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అమాయక గిరిజనులపై దాడిచేసే అధికారం ఎవరు ఇచ్చారని మండిపడ్డారు. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. తప్పు చేస్తే చట్టప్రకారం శిక్షించాలని, దాడులు చేయడం ఏమిటని మండిపడ్డారు. అటవీశాఖ అధికారుల దాడిలో గాయపడిన లింబారావు కుటుంబానికి ప్రభుత్వం రూ.30లక్షలు, పర్మినెంట్ ఉద్యోగం, 10 ఎకరాల సాగుభూమి, పక్కా ఇల్లు, ఉన్నత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు బలాన్‌పూర్ సర్పంచ్ ఆత్రం పరమేశ్వర్, కాంబ్లె అశీష్ హెచ్‌ఆర్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు, భాస్కర్ జిల్లా కార్యదర్శి, జ్ఞానేశ్వర్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ కోవ శంభు, గ్రామ పటేల్ కోవ మారు, సార్‌మేడి కుమ్ర మాన్కు ఉన్నారు.

సాధన చేశారు.. సాధించారు



పావుదే కైలాస్



బోయర్ అక్షయ్



సాయికిరణ్



కొట్రంగే సాయి



కుటుంబ సభ్యులతో పావుదే కైలాస్

- నలుగురు యువకులు ఆర్మీకి ఎంపిక

బేల: ఆ యువకులు దేశ సేవ చేయాలనే లక్ష్యంతో సాధన చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. కొలువులు సాధించడానికి వారెంతో కష్టపడ్డారు. లక్ష్యం పెట్టుకుని గమ్యం చేరుకునేందుకు ధృడ సంకల్పంతో ముందుకెళ్లారు. వారికి తల్లితండ్రులు సహకరించారు. పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి ఇండియన్ ఆర్మీలో సాధించి, మండలానికి చెందిన నలుగురు యువకులు అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఒకరు మొదటి ప్రయత్నంలో ఉద్యోగం సాధించగా, మరో ముగ్గురు రెండు మూడు ప్రయత్నాల్లో ఈ ఉద్యోగాలు సాధించారు. ప్రశంసలు అందుకుంటున్నారు. శనివారం రాత్రి విడుదలైన అగ్నిపథ్ ఆర్మీ ఉద్యోగాల్లో మండలానికి చెందిన నలుగురు యువకులు ఎంపికయ్యారు. ఇందులో.. మండల కేంద్రంలోని పాతబస్తీకి చెందిన పావుదే సవిత విశ్వంబర్‌ల ఏకైక కుమారుడు పావుదే కైలాస్ ఆర్మీ జనరల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అలాగే డోప్టాల గ్రామానికి చెందిన రాజన్నవార్ శోభ, అడెల్లుల ఏకైక కుమారుడు సాయికిరణ్ ఆర్మీలో టెక్నికల్ ట్రేడ్‌లో, బాది గ్రామానికి చెందిన కొట్రంగే లక్ష్మి కిషన్‌ల మొదటి కుమారుడు కొట్రంగే సాయి ఆర్మీ జనరల్ డిపార్ట్‌మెంట్, అవాల్‌పూర్ గ్రామానికి చెందిన బోయర్ మనోరమ తిరుపతిల ద్వితీయ కుమారుడు బోయర్ అక్షయ్ ఆర్మీ జనరల్ డిపార్ట్‌మెంటల్‌లో ఉద్యోగాలు సాధించారు.

తాంసి మండలం నుంచి ఇద్దరు..



శ్రీకాంత్



రాకేశ్

తాంసి: భారతదేశ సరిహద్దులో విధులను నిర్వహించేందుకు నిర్వహించిన అగ్నిపథ్ పరీక్షలో మండలానికి చెందిన యువకులు ప్రతిభ కనబర్చారు. గత నవంబర్ నెలలో జరిగిన దేహదారుఢ్య పరీక్షలలో ఎంపికై జనవరి 15న నిర్వహించిన పరీక్షకు హాజరయ్యారు. శనివారం రాత్రి వెల్లడించిన అగ్నిపథ్ ఫలితాలలో మండలంలోని తాంసి గ్రామానికి చెందిన చౌదరి శ్రీకాంత్‌తో పాటు వడ్డాడి గ్రామానికి చెందిన రాకేష్ ఎంపికయ్యాడు. యువకులను గ్రామస్తులు అభినందించారు.



అ'పూర్వ' సమ్మేళనం

- 40ఏళ్ల తరువాత ఒకే చోట..

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–84లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. వృత్తిరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 40మందికి పైగా ఒకేచోట చేరి సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి ఘనంగా సత్కరించారు. మృతిచెందిన మిత్రులు, ఉపాధ్యాయులకు సంతాపంగా మౌనం పాటించారు. ఇందులో రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గోపిడి జితేందర్, తదితరులు పాల్గొన్నారు.